# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 11

**ఒక్కసారి ఉలిక్కిపడి లేచాడు హసన్.** భారంగా కనురెప్పలు తెరుచుకున్నాయి. తలంతా దిమ్ముగా ఉంది. కళ్ళు సగం తెరిచి చూడగానే మసి బారిన పైకప్పు కనిపించీ, తనెక్కడ ఉన్నానా? అని పక్కకి తిరిగి చూసాడు. దూరంగా దీవానుపై మెహజబీన్ కనిపించింది. చుట్టూ పరికించి చూస్తే తన మందిరంలా అనిపించలేదు. పుట్టి బుద్ధి ఎరిగి తనెప్పుడూ ఇలాంటి చోట ఉండలేదు. ఇక్కడికెలా వచ్చానా అని మంచమ్మెదనుండి లేచు కూర్చున్నాడు. ఒక్కసారి నిద్రమత్తు వదిలింది. బయటకి తొంగి చూస్తే అప్పుడే చీకటి పడుతున్నట్లుగా అనిపించింది.

తనిక్కడకెలా వచ్చాడో అర్థం కాలేదు. మెహజబీన్ తనతో ఎలా వచ్చిందో అర్థం కాలేదు. అలసి పడుక్కున్న మెహజబీన్ని ఒక్కసారి కుదిపి లేపాడు. ఉలిక్కిపడి లేచి కూర్చుంది మెహజబీన్. ఎదురుగా హసన్.

"జబీన్! ఇక్కడికెలా వచ్చాం?" అసంకల్పితంగా అన్నాడతను.

"అదా, మీ తండ్రి సుల్తాన్ తీసుకొచ్చారు." కళ్ళు నులుపుకుంటూ అంది.

"అబ్బా జాన్ తీసుకొచ్చారా? ఇంతకీ మనం ఎక్కడున్నాం?" అర్థం కాలేదు హసన్‌కి.

మెహజబీన్ విషయమంతా చెప్పింది. ఏ పరిస్థితిలో తండ్రి ఇక్కడకి తీసుకొచ్చాడో, తనెందుకు ఇక్కడ ఉండిపోయిందో చెప్పింది.

"అమ్మీ సుల్తానా నీ గురించి బెంగ పెట్టుకుంది. ఆమె బాధ చూడలేక నేను నీకోసం ఉన్నాను. రేపుదయాన్నే నేను మహలుకి వెళిపోతాను."

హసన్ ఏమీ మాట్లాడలేదు. ఒళ్ళంతా బరువెక్కి కదల్లేకుండా ఉంది.

తనిప్పుడు గిసుదరాజ్ నివాసంలో ఉన్నాడన్నమాట. తనెందుకిక్కడ ఉండాలో, తన తండ్రి ఎందుకు ఇక్కడకి తీసుకొచ్చాడో అర్థం కాలేదు.

"జబీన్! సుల్తాన్ నన్నిక్కడకి తీసుకు రావడంలో ఆంతర్యం తెలీడం లేదు."

"నీ పరిస్థితి చూసి నీ తల్లితండ్రులకి ఏం చెయ్యాలో బోధ పడక గిసుదరాజుని ఆశ్రయించారు. నువ్వు పగలూ, రాత్రీ మద్యం మత్తులో పడి ప్రపంచాన్ని మర్చిపోతున్నావు. ఆరోగ్యం కూడా దెబ్బ తింటోంది. మీ అమ్మా, నాన్నా, నేనూ, బంధువులూ అందరం నీ గురించి దిగులు చెందుతున్నాం. నువ్వెందుకిలా తయారయ్యావో ఎవరికీ అర్థం కావడం లేదు." అని అంటూండగా మెహజబీన్ కళ్ళ నీళ్ళొచ్చాయి.

హసన్ వింటున్నాడు. జబీన్ కళ్ళ నీళ్ళు చూసాడు. ఏ మాత్రం చలించకుండా ఆలోచనలో పడ్డాడు. మెహజబీన్ అతను ఏమంటాడో వినాలనుకుంది. హసన్ నోరిప్పలేదు.

"నిన్న నీ పుట్టిన రోజు. ఆ సంగతయినా నీకు గుర్తుందా?" కోపంగా అంది మెహజబీన్.

"గుర్తుంది. పుట్టిన రోజయితే ఏంటట? అయినా మీరందరూ ఇంత చిన్న విషయానికి ఎందుకింత తీవ్రంగా ప్రవర్తిస్తున్నారో అర్థం కావడం లేదు." విసుగ్గా అన్నాడు.

"నీకేదీ ముఖ్యం కాదు. నీ తల్లి తండ్రులతో సహా! నీకు మద్యం ఉంటే చాలు." ఏడుపు దిగమింగుకుంటూ అంది.

"ఏం తాగడం తప్పా? సుల్తాన్ తాగడా? అసలీ గుల్బర్గా కోటలో తాగనివాళ్ళెవరు? నేనేమీ ఎవరికీ హాని చెయ్యడం లేదుగా?" అతని స్వరం మారింది.

"అవును. వాళ్ళూ తాగుతునారు. కాకపోతే అందులో పడి ప్రపంచానికి దూరంగా లేరు. వాళ్ళు బ్రతకడం కోసం తాగుతున్నారు. నువ్వు తాగడం కోసం బ్రతుకుతున్నావు. అదీ తేడా!"

హసన్ తిరిగి జవాబివ్వలేదు. మరలా ఆలోచనలోపడ్డాడు.

"నేను తాగుతున్నాను. కాదనను. కానీ దీన్ని నాకు అలవాటు చేసిందీ సుల్తానే! ఈ గుల్బర్గా మహల్లో నాతో ఎవరూ మాట్లాడరు. మా తండ్రికెంతసేపూ అధికారమూ, యుద్ధాలూ తప్ప ఏం పట్టవు. చిన్నతనం నుండీ ఏనాడూ పట్టించుకోలేదు. అమ్మ కూడా అంతే! తెలీని ఒంటరితనం. నాకు స్నేహితులుకూడా తక్కువే! ఉన్న ఒకే ఒక నేస్తం వేటాడ్డం. రోజూ వేటకి వెళ్ళలేను కదా? అందుకే మరో తోడు..అంతే!"

జబీన్ హసన్ దగ్గరగా వచ్చింది. అతని చేయిని తన చేతిలో తీసుకుంటూ -

"హసన్! నీ పరిస్థితి అర్థం చేసుకోగలను. నువ్వు మా అందరి మధ్యా నవ్వుతూ తిరగాలన్నదే మా కోరిక.

నువ్వు ఈ వ్యసనాలు మానెయ్యి. నీకు తోడుగా నేనుంటాను. ఏం చెయ్యమంటావో చెప్పు?"

తలదించుకున్నాడు హసన్.

వీళ్ళంతా చిన్న చిన్న విషయాలని పెద్దవిగా చూస్తున్నారు తప్ప అందులో అతనికి తప్పేమీ కనిపించలేదు. ఆలోచిస్తూ మంచమ్మీద వాలాడు.

కొంతసేపయ్యాక గిసుదరాజ్ వచ్చాడు. ఆయన్ని చూడగానే లేచి నుంచున్నారిద్దరూ!

"లేచావా, బేటా! ఇప్పుడెలా వుంది? నిద్ర బడలిక తీరిందా? నీకోసం మంచి విందు చెయ్యమని చెప్పాను. సాయంత్రం నమాజు చేసాక నీతో నేనూ ఇవాళ విందులో పాల్గొంటాను." గిసుదరాజ్ హసన్ని కుశల ప్రశ్నలు వేసాడు.

అన్ని కబుర్లూ చెప్పాడు కానీ హసన్ని ఎందుకిక్కడకి తీసుకొచ్చారో చెప్పలేదు.

సలావత్ సమయమాసన్న మయ్యిందంటూ గిసుదరాజ్ బయల్దేరాడు.

"మౌలియా గిసు దరాజ్! నేను నా మందిరానికి వెళ్ళాలనుకుంటున్నాను." గిసుదరాజ్ వెళుతూండగా అన్నాడు హసన్.

గుమ్మం వరకూ వెళ్ళిన గిసుదరాజ్ వెనక్కి తిరిగి చూసాడు.

"ఈ గిసు దరాజ్ మందిరానికి ఎవరికైనా రావడానికి అనుమతి అవసరం లేదు. తిరిగెళ్ళడానికి మాత్రం ఖచ్చితంగా కావాలి. సమయం వచ్చినప్పుడు నేనే నీకు చెప్తాను." నవ్వుతూ అన్నాడు.

హసన్‌కి అర్థమయ్యింది. జబీన్ చెప్పినవీ, గిసుదరాజ్ చెప్పినవీ అన్ని ముక్కలూ మనసులో అతుక్కుంటున్నాడు.

ఎంత ప్రయత్నించినా అర్థంకావడం లేదు. నిద్ర మత్తు వదిలింది కానీ, మనసుకంటిన మత్తు మాత్రం తగ్గలేదు. దేనికయినా సమయం రావాలి.

00000000000

ఆ సాయంత్రం వేదరాయశర్మా భార్య సుభద్రతో కలిసి నేహల వాళ్ళింటికి బయల్దేరాడు. విజయనగరం నుండి తెచ్చిన కానుకలన్నీ తీసుకొని వచ్చిన అధికారులూ బయల్దేరారు. వేదరాయశర్మ ఇంటి ముందు గుర్రాలూ, గుర్రబ్బళ్ళూ చూసి పక్కింటి వాళ్ళందరూ శ్చర్యపోయారు. ఇంతకు ముందెన్నడూ ఇంతమంది సైనికుల్నీ వాళ్ళు చూళ్ళేదు. వేదరాయశర్మింటికి విజయనగరం నుండి అప్పుడప్పుడు ఒకరిద్దరు అధికారులు రావడం చూసారు కానీ, మరీ ఇంతమంది రాగా చూడ్డం ఇదే మొదటి సారి. ఏదో రాజ్యానికి సంబంధించిన విషయమనుకున్నారు. సుభద్ర కూడా వేదరాయశర్మ ఇంటికి చేరే వరకూ విషయం తెలీదు. అందువల్ల పొరుగింటి వాళ్ళతో మాట్లాడే సమయమే చిక్కలేదు.

ముందు ఒక చేత్తో దండమూ, రెండో చేతిలో కానుకల పళ్ళాలతో అధికారులు నడుస్తున్నారు. వారి వెనుకే వేదరాయశర్మా, సుభద్రా నడుస్తున్నారు. వీళ్ళని అందరూ ఏమిటాని? ఆశ్చర్యంగా చూస్తున్నారు. పరిచయస్తుల్ని నవ్వుతోనే పలకరిస్తున్నారు కానీ ఎక్కడకి వెళుతున్నదీ చెప్పలేదు.

నేహల ఇంటిని సమీపించగానే వీధి అరుగు మీద సురేంద్ర ఏదో పని చేసుకుంటూ కనిపించాడు. ఇంటి బయటెవరూ లేరు. వేదరాయశర్మ రాకని సురేంద్ర గమనించలేదు. పనిముట్లు పెరట్లో దాచడానికి లోపలకి వెళ్ళాడు.

వేదరాయశర్మ ఇంటి ముందుకొచ్చి కాసేపాగాడు. హరీంద్ర కనిపిస్తాడేమోనని చూసాడు. ఎక్కడా జాడ లేకపోయేసరికి భార్య సుభద్రని లోపలికి వెళ్ళమన్నట్లుగా సైగ చేసాడు. సుభద్ర మెల్లగా లోపలకెళ్ళింది.

చడీ చప్పుడూ లేకుండా వచ్చిన సుభద్రని చూసి ఆశ్చర్యపోయింది నేహల తల్లి చంద్రమ్మ. వేదరాయశర్మ భార్య వాళ్ళింటికెప్పుడూ రాలేదు. ఇదే మొదటిసారి. కొత్తగా వచ్చిన సుభద్రని చూసి నవ్వుతూ బావున్నారా? అంటూ పలకరించింది. వంటపనిలో ఉన్న తను చేతులు కడుక్కుని బయటకొచ్చింది.

వేదరాయశర్మ కూడా సురేంద్ర కోసం వచ్చాడనీ చెప్పింది. వేంటనే చంద్రమ్మ పెరటివైపు వెళ్ళి భర్తకి విషయం చెప్పింది. ఇద్దరూ తమింటికొచ్చిన పరిచయమున్న కొత్త అతిధుల్ని చూసి కొంత ఆశ్చర్యపోయారు.

వేదరాయశర్మని చూసి లోపలకి విచ్చేయుమని ఆహ్వానించాడు సురేంద్ర.

వేదరాయశర్మతో పాటొచ్చిన వాళ్ళని చూసి ఎవరా, ఎందుకొచ్చారాని అనుకున్నాడు.

"రండి వేదరాయశర్మగారూ! మీవంటి పెద్దలు రావడం చాలా సంతోషం!" అంటూ లోపలకి తీసుకెళ్ళి ఆసనమ్మీద కూర్చోబెట్టాడు. వచ్చిన అధికారులు నిలబడే ఉన్నారు.

"సురేంద్రా! నీతో చిన్న పని పడి వచ్చాను." వేదరాయశర్మ అన్నాడు.

"నాకు చిన్న కబురు పంపిస్తే నేనే వచ్చే వాణ్ణి కదా సామీ! మీరు మా ఇంటికి రావడం మాకు ఆనందమే కానీ మీరెందుకు శ్రమతీసుకోవడం చెప్పండి?" వినయంగా అన్నాడు సురేంద్ర.

"పని చిన్నదయినా, పంపిన వారు రాజ్యాధిపతులు. కాబట్టి వారి దూతగా నేను రావడమే సబబు.

నువ్వు చాలా అదృష్టవంతుడివి సురేంద్రా! ఈ విజయనగర సామ్రాజ్యంలో ఎవరికీ దక్కని గౌరవం నీకు లభించింది. ధనలక్ష్మి సరస్వతిని వెతుక్కుంటూ వస్తుందంటారు. కానీ ఈ సారి రాజ్యలక్ష్మి వాగ్దేవి ముందు మోకరిల్లుతోంది." నవ్వుతూ చెప్పాడు వేదరాయశర్మ.

హరీంద్రకి ఏమీ అర్థంకాలేదు. అయోమయంగా భార్య చంద్రమ్మ కేసి చూసాడు. ఆవిడదీ ఇదే పరిస్థితి.

ఇద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. చివరకి సురేంద్రే అడిగాడు.

"క్షమించండి స్వామీ, మీరు చెప్పేదేవిటో బోధపడడం లేదు. రాజ్యలక్ష్మేమిటి? వాగ్దేవేమిటి? అస్సలు తెలియడం లేదు స్వామీ! మన్నించి వివరం చెప్పండి.."

"చెప్పడానికే నేనొచ్చాను! అది సరే, ఏదీ మా ప్రియ శిష్యురాలు నేహలెక్కడా? ఇంట్లో లేదా?"

వస్తూనే వేదరాయశర్మ కళ్ళు నేహల కోసం వెతికాయి. ఎక్కడికి వెళ్ళిందా అనుకున్నాడు.

"స్నేహితురాలు ప్రభా వాళ్ళింటికెళ్ళింది. కబురు పంపమంటారా?"

"వద్దొద్దు. అవసరం లేదు. కనిపించకపోయేసరికి అడిగానంతే! అమ్మా చంద్రమ్మా, నువ్వూ మీ నేహలా క్రితం జన్మలో ఎంతో పుణ్యం చేసుకున్నారమ్మా! మీ అమ్మాయి నేహలని వివాహమాడడానికి మన విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీ శ్రీ శ్రీ దేవరాయలు వారు ఈ విషయం చెప్పడానికి మమ్మల్ని పంపారు. నేహలలాంటమ్మాయిని విజయనగర పట్టపురాణిగా అలంకరించడానికి మహారాజు ముచ్చటపడుతున్నారు. మిమ్మల్ని తక్షణమే విజయనగరానికి తోడ్కొని రమ్మనమని చెప్పారు. కాబోయే మహారాణికి కావల్సిన వస్త్రాభరణాలూ, ధనమూ ఇచ్చి పంపారు. సురేంద్రా, నేహలని కన్నందుకు మీరెంతో గర్వపడాలి. మీరే కాదు యావత్తు ముద్గల్ గ్రామమూ ఆనందంలో తేలియాడుతుంది." అంటూ సురేంద్ర చేతులు పట్టుకొని చెప్పాడు.

ఇది విని నోట మాటరాలేదు సురేంద్రకీ, చంద్రమ్మకీ! ఇద్దరూ విస్తుపోయారు. తాము వింటున్నది కలా, నిజమా అన్న మీమాంసలో పడ్డారు. నమ్మబుద్ధి కావడం లేదు. నిజమా అన్నట్లు చంద్రమ్మ సుభద్రవైపు చూసింది. అవున్నట్లుగా తలూపిందావిడ. చంద్రమ్మ కళ్ళల్లో కాంతి చూసి వేదరాయశర్మా, చంద్రమ్మా సంతోషించారు. సురేంద్ర మాత్రం ఇంకా తేరుకోలేదు.

తెచ్చిన కానుకల పళ్ళాలు అక్కడున్న బల్లమీద పెట్టారు. పైన వున్న గుడ్డని తొలగిస్తే వాటిని చూసి నోరెళ్ళబట్టింది చంద్రమ్మ.

లెక్కలేనన్ని బంగారు భరణాలూ, పట్టు వస్త్రాలు, ముత్యాలూ, రత్నాలూ - పుట్టాక తనెప్పుడూ ఇన్ని చూడలేదు. తన కూతురు విజయనగర రాజ్యానికి రాణి కాబోతోందన్న సంతోషం ఆమె కళ్ళనే కాదు దేహాన్నంతా వరించింది. ఒక్కసారి ఒళ్ళు జలదరించింది. భార్య స్థితిని చూసాకా సురేంద్రా మెల్లగా విషయం జీర్ణించుకున్నాడు. నేహల అదృష్టానికి సంబరపడిపోయాడు.

"అయ్యా! ఏమిటి మీరంటున్నది. హాస్యం కాదు కదా? మా నేహలేవిటి? మహారాణి కావడమేవిటి? నిజమేనా?"

తడబడుతూన్న సురేంద్ర మాటల్లో అతని ఆనందం ప్రతిధ్వనించింది. వేదరాయశర్మ విషయమంతా చెప్పాడు.

"సురేంద్రా! నీకూ, నీ భార్యకీ ఈ వివాహం సమ్మతమేనా?" వేదరాయశర్మ తెలివిగా ముందు సురేంద్ర నిర్ణయం బయటకి కక్కించాలని ప్రయత్నిస్తున్నాడు. నేహల ఇంటి పట్టున లేకపోవడం మంచిదే అయ్యింది. సురేంద్ర దగ్గర మాట తీసుకుంటే చాలు. నేహల తమని తప్పు పట్టదు. పైగా తండ్రి నిర్ణయాన్నీ శంకించదు.

"ఏ తండ్రయినా ఇంతకంటే ఏం కోరుకుంటాడు స్వామీ! నాకూతురు సంతోషంగా ఉండడమే నాక్కావల్సింది." ఏమంటావన్నట్లుగా భార్య చంద్రమ్మ కేసి చూసాడు. ఆవిడా అవున్నట్లు తలూపింది.

"సంతోషం సురేంద్రా! ఒక్క మాట అమ్మాయికి కూడా చెప్పాలి కదా?"

రాచరికపు వాసనలు తగిలిన వేదరాయశర్మకి లౌక్యం బాగానే వంటపట్టింది.

"దానిమొహం. మా నేహల అమాయకురాలు స్వామీ. నా మాట ఎప్పుడూ కాదనదు. అమ్మాయి ఇంటికి రాగానే విషయం చెప్పి మీ ఇంటికి తీసుకొస్తాను." సురేంద్ర ఆనందానికి అవధుల్లేవు. ఇంతసేపూ ఒక్క మాటకూడా చంద్రమ్మ నోటి నుండి బయటకు రాలేదు.

ఆనందమూ, సంతోషమూ ఎక్కువయితే మాటలు మూగపోతాయి. వాస్తవంలోకి వచ్చినప్పుడే అవి ఆలోచించడం మొదలు పెడతాయి.

నేహల తల్లితండ్రులు వాస్తవంలోకి రావడానికి ఇంకా సమయం పడుతుంది.

విజయనగర వైభోగమూ, మహారాణి అందలమూ తలచుకుంటూ కబుర్లలో పడిపోయారు వారందరూ!

0000000000000000

నేహల పొరుగింటి వాళ్ళు సురేంద్రింటికొచ్చిన వాళ్ళని పరిశీలనగా చూస్తూనే ఉన్నారు. కానుకలు తీసుకొని విజయనగరం నుండి ఎవరో వచ్చారన్న వార్త వాళ్ళ ఆఖరబ్బాయి నేహలకి చెప్పడానికి ప్రభా వాళ్ళింటికి తుర్రుమన్నాడు. ప్రభా వాళ్ళింటికెళ్ళేటప్పుడు నేహల ఆ పిల్లాణ్ణి తనకి సాయం రమ్మనమంది. పిల్లాడు రాను పొమ్మన్నాడు. అందువల్ల నేహలొక్కత్తే వెళ్ళింది. అందుకే వాడికి నేహలెక్కడుందో తెలుసు. రివ్వు మంటూ ప్రభా వాళ్ళింటిముందు వాలాడు.

లోపల ప్రభా, నేహలా వామనగుంటలు ఆడుకుంటున్నారు. పిల్లాడు సరా సరి ఇంట్లోకి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"అక్కా! విజయనగరం నుండి మీ ఇంటికెవరో చాలా మంది చుట్టాలొచ్చారు. నువ్వు వెంటనే రావాలి." ఆయాస పడుతూ చెప్పాడు.

నేహలకేమీ అర్థం కాలేదు. ప్రభదీ అదే పరిస్థితి.

"ఏంరా! నిజంగా వచ్చారా? లేక వేళాకోళం చేస్తున్నావా?" ప్రభే అంది.

"లేదక్కా! దేవుడిమీదొట్టు. నేహలక్కరంమ్మటే రానన్నవాణ్ణి ఎందుకొచ్చాను చెప్పు?"

విజయనగరం నుండి ఎవరొచ్చారా? అన్న సందేహంతో ఇంటికెళ్ళడానికి లేచింది నేహల.

నేహలా, ప్రభా నమ్మారు. ఇంటికెళ్ళొస్తానని హుటాహుటిన బయల్దేరింది నేహల. ఆమె వెనుకే పక్కింటి పిల్లాడూ వెళ్ళాడు.

దారిలో పిల్లాణ్ణి ఎవరొచ్చారంటూ గుచ్చి గుచ్చి అడిగింది. వేదరాయశర్మా చాలామంది విజయనగర భటులూ వచ్చారని చెప్పాడు. అంతకు మించి తనకి తెలీదన్నాడు.

భటులనే సరికి భయపడిపోయింది నేహల. తండ్రికేమీ అపాయం రాలేదుకదాన్న దిగులుతో వడివడిగా అడుగులు వేసుకుంటూ కీడు శంకించిన మనసుతో ఇంటిముఖం పట్టింది.

000000000000000

ఇంటికి చేరుకోగానే గుమ్మం వద్ద కొంతమంది భటులు కనిపించారు. గుమ్మం వరకూ హుటా హుటిన వచ్చిన నేహల ఒక్కసారి ఆగిపోయింది. వీధిగది దాటి లోపల మండువా లోగిల్లోకి అడుగు పెడుతూ గుమ్మం దగ్గర భయం భయం అడుగెట్టింది. బేలగా అందర్నీ చూసింది. వేదరాయశర్మా, తండ్రీ నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్నారు. ఇంకో పక్కన సుభద్రా, తల్లీ కబుర్లు చెప్పుకుంటున్నారు. మరికొంతమంది భటులూ, తలపాగాలు ధరించిన అధికారులూ కనిపించారు. అర్థంకాని ఆశ్చర్యంతో అందరికేసి చూసింది. తల్లీ తండ్రి నవ్వుతూ మాట్లాడుతూ కనిపించేసరికి మనసు కాస్త కుదటపడింది. ఎవరికీ అపాయం లేదనుకుంది.

అందరికేసి తేరపార చూస్తూ మెల్లగా మండువా గుమ్మం దాటింది.

ఎవరో వచ్చిన అలికిడి విని కబుర్లలో మునిగిపోయిన తండ్రి హరీంద్రా, వేదరాయశర్మా తలతిప్పి చూసారు. నేహలని చూడగానే హరీంద్ర కళ్ళు సంతోషంతో మెరిసాయి.

తండ్రి ఒక్క ఉదుటన లేచి నేహలని సమీపిస్తూ - "రా తల్లీ! నీకోసమే ఎదురుచూస్తున్నాం. వేదరాయశర్మగారు నీకో శుభవార్త తెచ్చారు." అన్నాడు.

నేహల అర్థం కానట్టు చూసింది. తల్లి కూడా నేహలని చూసి దగ్గరగా వచ్చి "నువ్వెంత అదృష్టవంతురాలివి తల్లీ! ఇది నేను కల్లోకూడా ఊహించలేదు." అని ఆనందంగా ఉంది.

పూర్తిగా అర్థంకాకపోయినా నేహలకి కొంచెం కొంచెం తెలుస్తోంది. ఏమీ మాట్లాడ కుండా మౌనంగానే తల్లి తండ్రులకేసి చూసింది.

ఇంతలో వేదరాయశర్మ కూర్చున్న చోటునుండి లేచి వాళ్ళ దగ్గరగా వచ్చాడు.

"అవునమ్మా నేహలా! మీ తల్లిగారు చెప్పింది అక్షరాలా నిజం. విజయనగర సామ్రాజ్యాధిపతి నీ వద్దకు రావడం సామాన్యమైన విష్యం కాదు. చూడు ఈ కానుకలన్నీ కాబోయే పట్టపురాణికి మహారాజు పంపించారు. నువ్వే కాదు -యావత్తు ముద్గల్ వాసులూ నిన్ను చూసి గర్వపడేలా చేసావు." వేదరాయశర్మ నేహల నెత్తిమీద ఆప్యాయంగా నిమిరాడు.

"పట్టపురాణా.....?" అప్రయత్నంగా పక్కకుజరుగుతూ న్న ఆమె నోటి వెంట ఆ మాటలొచ్చాయి. నేహలకి విషయం అర్థమయ్యింది.

తల్లి కేసి చూసింది. ఆమె మొహం ప్రతీ తల్లిలాగే సంతోషంతో విప్పరిపోయింది.

"అవునమ్మా! మహారజు శ్రీ దేవరాయల వారు ప్రత్యేకంగా వేదరాయశర్మ గారిచేత కబురంపారు. ఎన్ని కానుకలు పంపారో చాడు. ఈ పట్టు వస్త్రాలన్నీ కాబోయే మహారాణికోసం పంపారు." అంటూ సుభద్ర కూడా వేదరాయశర్మ పక్కగా వచ్చి అంది.

నేహల తండ్రికేసి కేసి అయోమయంగా చూసింది. మెల్లగా వారికి దూరంగా జరిగి పక్కకు వెళ్ళింది. పట్టపురాణనగానే ఎగిరి గంతేస్తుందనుకున్నాడు హరీంద్ర.

అటువంటివేమీ లేకుండా, ఏ భావమూ లేకుండా నిస్తేజంగా ఉన్న కూతురి మొహం చూస్తే కాస్త శంక కలిగింది.

ఇదే అదననుకొని నేహలని చూస్తూ వేదరాయశర్మ ఆమెకు ఏ ఆస్కారమూ ఇవ్వకుండా అసలు సంగతి చెప్పాడు.

"నేహలా! ఈ వార్త విని నీ తల్లితండ్రులూ ఎంతో పొంగిపోయారు. ఏ తండ్రయినా తన కూతురి సౌభాగ్యాన్నే ఆ-శిస్తాడు. ఈ మాఘమాసంలో మంచి ముహూర్తాలున్నాయి. ఇవాళ నుండీ నువ్వు ఈ పట్టు వస్త్రాలే ధరించాలి. మీ ఇంటి ముందు అంగరక్షకులు కాపలాగా ఉంటారు. మంచి తిథి చూసుకొని మనం విజయ నగర ప్రయాణానికి సిద్ధం కావాలి. మహారాజు నిన్ను చూడాలని ఎంతో తహతహ లాడుతున్నారు."

వేదరాయశర్మ ప్రతీ మాట నేహల శరీరంలో కంపరం పుట్టించాయి. ఒక్కాసారి కన్నెత్తి గురువుగారికేసి చూసింది. కళ్ళల్లో కనిపించని కోపం వుంది. వేదనుంది.

అంతవరకూ తనంతట తానుగా నోరు విప్పని నేహల మెల్లగా తండ్రి కేసి చూస్తూ అంది.

"ఈ పెళ్ళికి నువ్వు అంగీకారం తెలిపావా అప్పా?" వెల్లువలా వచ్చే కన్నీటిని పుకుంటూ గాద్గిక స్వరంతో అంది.

ఏం మాట్లాడకుండా అవున్నట్లు తలూపాడు.

"నాకొక్క మాట కూడా చెప్పకుండా నువ్వే.." ఇహ మాటలు పెగల్లేదు నేహల్కి.

మొహం కన్నీటి పర్యంతమయ్యి విసూరుగా తన గది వైపు పరిగెత్తింది నేహల.

కూతురి కళ్ళల్లో కన్నీళ్ళు చూసి హరీంద్రా, చంద్రమ్మా ఆశ్చర్యపోయారు. వేదరాయశర్మ ఎదురిస్తుందని ఊహించాడు కానీ ఇలా బాధ పడుతుందనుకోలేదు.

నేహలని చూసి అక్కడున్న అందరూ విస్తుబోయి చూసారు. మహారాజుతో పెళ్ళంటే ఏ అమ్మాయయినా ఎగిరి గంతేస్తుంది. ఆమె ఎందుకు ఏడుస్తూందో ఎవరికీ అర్థం కాలేదు.

నమ్మశక్యం కాని వార్తలెదురయినప్పుడు కలిగే ఆశ్చర్యమూ, బాధా అనుకున్నారందరూ!

కూతురి వెనుకే హరీంద్రా వెళ్ళాడు. అతని వెనుకే చంద్రమ్మా వెళ్ళింది.

ఏడుస్తూ మంచమ్మీద కూలబడింది నేహల.

"ఏమయ్యిందమ్మా! ఎందుకు ఏడుస్తున్నావు? ఇది నమ్మలేకపోతున్నావా?"

తండ్రి ప్రశ్నల పరంపరకి చివాలున తలెత్తి చూసింది.

"నువ్వు కూడా ఇలా చేస్తావని నేనుకోలేదు అప్పా!" నేహల కళ్ళు జలపాతాలయ్యాయి.

"ఏం. ఈ పెళ్ళి..." అంటూ ఆగిపోయాడు.

నేహలే కాస్త నిబ్బరించుకొని అంది.

"నాకు కాస్త సమయం కావాలి నాన్నా. ముందా ఇంటికొచ్చిన వాళ్ళని సాగనంపండి. మనం తీరుబడిగా తర్వాత మాట్లాడుకోవచ్చు."

కూతురికి ఈ పెళ్ళి మీద ఆసక్తిలేదని తెలిసింది హరీంద్రకి. ముందు ఇంటికొచ్చిన వాళ్ళని పంపించి తర్వాత కూతురికి నచ్చ చెప్పచ్చని అనుకుని వెళ్ళడానికి లేచాడు. నేహల మంచమ్మీద నుండి లేచి కూర్చుని పావడా కొంగుతో మొహం తుడుచుకుంది. తల్లి చంద్రమ్మ ఏదో చెప్పబోయింది.

వద్దన్నట్లుగా చెయ్యి చూపించి తండ్రి వెనుకే మండువా వైపు వెళ్ళింది.

హరీంద్రని చూసి వేదరాయశర్మకి లోపల ఏం జరిగిందో అర్థంకాలేదు.

"అయ్యా! ఇంత పెద్ద వార్త విని అమ్మాయి తట్టుకోలేకపోయింది. మాకు కాస్త సమయమివ్వండి. రేపుదయమే మీ ఇంటికొస్తాను. అప్పుడన్ని విషయాలూ మాట్లాడుకుందాం. అంతవరకూ మాకు ఈ అవకాశం కల్పించండి.." హరీంద్ర వేదరాయశర్మని ప్రాధేయపడ్డాడు.

ఊహించనదే జరిగింది. చిన్నతనం నుండీ నేలని తనెరుగుదును.

వేదరాయశర్మ సరే నన్నట్లు తలూపి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. అతని వెనుకే అధికారులూ లేచారు. సుభద్ర భర్తని అనుసరించింది.

వెళ్ళబోతూ వేదరాయశర్మే వెనక్కి తిరిగి హెచ్చరించాడు.

"హరీంద్రా! నువ్వు ఈ పెళ్ళికి అందరిముందూ అంగీకారం తెలిపావు. ఈ అధికారులే దానికి సాక్ష్యం. రేపు ఉదయానికల్లా ఏ విషయమూ చెప్పాలి. ఇది మహారాజులతో వ్యవహారం. నిదానంగా ఆలోచించాలి."

వేదరాయశర్మ తన తెలివితేటలతో హరీంద్రని ఇరికించడానికి అధికారుల సమక్షాన్ని ఆసరాగా తీసుకున్నాడు. అంతో ఇంతో రాజకీయం తెలుసున్నవాడు కదా?

ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా ఎదురు ఎత్తు వేసాడు. అందుకే హరీంద్ర ఒప్పుకున్నాడన్న సంగతి మరోసారి అందరిముందూ గుర్తుచేసాడు.

"అలాగే స్వామీ!" అంతకు మించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు హరీంద్ర.

వెళ్ళబోయే ముందు అధికారులు తెచ్చిన కానుకల కేసి చూసినప్పుడు అక్కడే వదలమన్నట్లుగా సైగ చేసాడు వేదరాయశర్మ. అవి అక్కడుండమే క్షేమం.

ఆభరణాలు ఆశని వెలికి తీస్తాయి. కనకం కాంక్షని రేకెత్తిస్తుంది; ముఖ్యంగా ఆడవాళ్ళకి.

శాస్త్రాలనీ మనుషుల్నీ చదువుకున్నవాడు. మాత్రం గ్రహించలేని వ్యక్తి కాదు వేదరాయశర్మ.

ఇంటికొచ్చిన పెద్దల్ని బయట గుమ్మం వరకూ సాగనంపి ఒకటికి పదిసార్లు కూతురికి నచ్చ చెబుతానని చెప్పాడు.

ఏం జరుగుతుందాని వీధిగది కిటికీ లోంచి అంతా జాగ్రత్తగా గమనిస్తోంది నేహల. అందరిముందూ తను అసభ్యంగా ప్రవర్తించడం ఇష్టం లేదు. కావాలంటే అక్కడే వేదరాయశర్మ మొహమ్మీద గట్టిగా చెప్పగలదు. గురువుగారన్న గౌరవంతోనూ, ఇంటికొచ్చారన్న మర్యాదతోనూ తనని తాను సంబాళించుకొని ఆగిపోయింది. తండ్రీ అక్కర్లేదు. తనూ ధైర్యంగా చెప్పగలదు.

ఊహించని ఈ పరిణామానికి దిగులుతో మెల్లగ అడుగులు వేసుకుంటూ లోపలికొచ్చాడు హరీంద్ర.

మౌనంగా మండువాలోకి వెళుతున్నతన్ని అనుసరించింది నేహల.

లోగిల్లో వారిచ్చిన కానుకలు సర్దుతూ కనిపించింది చంద్రమ్మ. తల్లిని చూసి "అమ్మా!" అంటూ ఒక్కసారి గట్టిగా అరిచింది నేహల.

హరీంద్ర వెనక్కి తిరిగి చూసాడు.

"అవి ముట్టద్దు. ఎలా వున్నవి అలాగే ఉంచు." తల్లివైపు కోపంగా చూస్తూ అంది.

"ఏమయ్యిందమా నీకు? ఎందుకిలా ప్రవర్తిస్తున్నావు? మహారాజు పెళ్ళి చేసుకుంటానంటే ఎవరైనా సంతోషిస్తారు. ఈ అదృష్టం, సౌభాగ్యం ఎవరికీ దక్కవే! ఇంటికొచ్చిన లక్ష్మిని కాదనకూడదే!" అంతవరకూ మౌనంగా ఉన్న నేహల తల్లి గట్టిగానే అంది.

"అవును. ఇది అదృష్టమే! ఎవరో ముక్కూ మొహం తెలీని మహారాజు పెళ్ళికి కబురంపిస్తే సరే నంటూ తలూపారా? నా గురించొక్కసారయినా ఆలోచించారా? నా ఇష్టా ఇష్టాలు మీకక్కర్లేదా?"

"చూడమ్మా! నేహలా! నీకింకా పసితనం పోలేదు. ఏది మంచీ ఏది చెడో తెలీని వయస్సు నీది. మేం నీకు కీడు తలపెడతామా చెప్పు తల్లీ? నీ ఆనందమే మాక్కావాలి. ఏ తల్లితండ్రులయినా కూతురి సౌభాగ్యాన్నే కోరుకుంటారు. మీ అమ్మా, నేనూ అదే చేసాం." హరీంద్ర నచ్చ చెప్పడానికి ప్రయత్నించాడు.

"అవును నేనింకా పసిపిల్లనే! నాకిష్టాయిష్టాలుండవు. మీరు నా సౌభాగ్యం కోరుకుంటారు కాబట్టి మీరేంచేసినా నాగురించేనని ఒప్పుకోవాలి. నాకు తెలుసు. మీరీ కానుకలూ, పట్టపురాణన్న బిరుదులూ చూసి అంతా నాకు మంచే చేస్తున్నామన్న భ్రమలో ఉన్నారు. మీరు నాకు పెళ్ళి చెయ్యడం లేదు. పాడి కడుతున్నారు." ఆవేశంగా అంది నేహల.

"ఏమిటా పిచ్చి మాటలు? ఆవేశంలో ఏం మాట్లాడుతున్నావో తెలియడం లేదు. మహారాజు పెళ్ళి చేసుకుంటానని కబురంపిస్తే కాలదోస్తున్నావు. ఏం నువ్వొక్కత్తివే ఈ ప్రపంచంలో ఉన్నావా? మహరాజు కావలంటే వెయ్యిమంది నీ లాంటి వాళ్ళని తెచ్చుకోగలడు." హరీంద్రా గొంతు పెంచాడు. తండ్రెప్పుడూ ఇలా మాట్లడ్డం చూళ్ళేదు నేహల.

"నేను చెప్పేదీ అదే నాన్నా! నాలాంటి వాళ్ళను ఎప్పుడు కావాలంటే అప్పుడు మాహారాజు తెచ్చుకోగలడు. ఆయనకి - తన ఇష్టాలే తప్ప వేరే వారితో పని లేదు. అధికార గర్వం తప్ప అందులో అభిమానం ఉండదు. అహంకారం తప్ప ఆలోచనుండదు.

అతనిక్కావాలంటే రాజ్యంలో నేను తప్ప అమ్మాయిలే దొరకలేదా? వాళ్ళకి కావాల్సింది వాళ్ళ కోరికలు నెరవేర్చుకోవడం. అంతే!" నేహల కళ్ళ నీళ్ళొస్తున్నాయి. తండ్రి తన బాధని అర్థం చేసుకోవడంలేదని వేదనగా అంది.

"మాహారాజుకేమయినా వెర్రి పట్టిందా? వేదరాయశర్మగారు నీ మేలు కోరి నీ గురించి చెప్పారు. నీకున్న గుణగణాలు చూసి నీతో జీవితం పంచుకోవాలని మహారాజు ముచ్చటపడితే ఇలా వాదిస్తావేమిటే?"

తండ్రి బాధగా అన్నాడు. అతని గొంతులో తీవ్రతని గ్రహించింది నేహల.

"మహారాజు నా పరువాన్ని పంచుకుంటాడు తప్ప జీవితాన్ని కాదప్పా! మీకెలా చెప్పాలి?"

గాయపడ్డ పక్షిలా విలవిల్లాడుతూ తన గదివైపు వెళ్ళిపోయింది నేహల.

00000000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library

**NEW**
Click here to share your comments on this serial